# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 14.01.2025

24 క్యారెట్లు 80,070 | కిలో వెండి 1,02,000 | 28 °C | సంపుటి:2 | సంచిక:84

www.vishalabharati.com





# కులగణన సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డుల జారీ

- ఆదాయ పరిమితి గ్రామాల్లో రూ.1,50,000
- పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు
- గ్రామ, వార్డు సభల్లో జాబితా
- సభ్యుల మార్పులు, చేర్పులకు అవకాశం
- ఈ నెల 26 నుంచి మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన పౌరసరఫరాల శాఖ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఈనెల 26 నుంచి రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసింది. రేషన్ కార్డుల అర్హత ప్రమాణాల పరిశీలనకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఉపసంఘం నిర్ణయాల ప్రకారమే రేషన్ కార్డుల జారీ జరుగుతుంది. ఇటీవల జరిగిన కుల గణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితా సిద్ధం చేశారు. కొత్త ఆహార భద్రత కార్డుల జారీకి సంబంధించి విధి విధానాలు ఇలా ఉన్నాయి. కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా జిల్లా కలెక్టర్లు/జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించబడుతుంది. మండల స్థాయిలో ఎంపీడీఓ/యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ లేదా వార్డు సభలో ప్రదర్శించి చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారు. గ్రామ సభ లేదా వార్డు సభల ద్వారా ఆమోదించబడిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల / మున్సిపాల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్ / జీహెచ్ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపాలి. ఆ విధంగా పంపిన జాబితాను జిల్లా కలెక్టర్ / జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే పౌరసరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపాలి. ఫైనల్ లిస్ట్ ప్రకారం సీసీఎస్ కొత్త రేషన్ కార్డులు

..మిగతా 2 లో

# 4 పథకాలు.. రూ.45 వేల కోట్లు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఇందిరమ్మ ఇండ్లకు రూ.22,500 కోట్లు
- రైతు భరోసాకు రూ.18వేల కోట్లు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.2వేల కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

2025, జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 కొత్త పథకాలను ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ నాలుగు పథకాల అమలు కోసం ప్రభుత్వం దాదాపు 45 వేల కోట్లకు పైగా ఖర్చు చేయబోతుందని చెప్పారు. సోమవారం (జనవరి 13) రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,

..మిగతా 2 లో

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు..


- త్వరలో సీఎం రేవంత్ ఆకస్మిక పర్యటనలు
- ఇళ్లు ఉన్న వారికి ఇళ్లిస్తే మొదటి బాధ్యులు కలెక్టర్లే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



..మిగతా 2 లో

# భక్తజనసంద్రంగా ప్రయాగ్‌రాజ్

- త్రివేణి సంగమంలో మహాకుంభమేళా ప్రారంభం
- తరలివస్తున్న కోట్లాది మంది భక్తులు
- 45 రోజుల పాటు జరగనున్న క్రతువు
- యూపీకి రూ.2 లక్షల కోట్ల ఆదాయం
- కోట్లాది భారతీయులకు ఇది ప్రత్యేకమైన రోజు
- ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ఆరంభమైంది. ఈ తెల్లవారు జామున 5.15 నిమిషాలకు పౌష్య పూర్ణిమ తిథి ప్రవేశించిన ఘడియలలో ఈ కుంభమేళా మొదలైంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్


..మిగతా 2 లో

# పెట్టుబడులే టార్గెట్

- అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలి
- దావోస్‌లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- 20 నుంచి దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు
- హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

"పెట్టుబడులంటేనే తెలంగాణ అనేలా ఉండాలి. అందుకు తగ్గట్లుగా మన ప్రణాళికలను రూపొందించాలి. పెట్టుబడులకు గమ్యస్థానంగా ఇప్పటికే దేశంలో అందరి దృష్టిని తెలంగాణ ఆకర్షిస్తోంది. విదేశీ కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉంది. దావోస్ పర్యటన సందర్భంగా.. ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈవీఫ)లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 20 నుంచి దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ కు ఆయన వెళ్లనున్నారు. అంతకంటే ముందు



..మిగతా 2 లో

# నేడు పసుపు బోర్డు ఏర్పాటు

- తెలంగాణ రైతులకు కేంద్రం సంక్రాంతి కానుక
- ఎన్నో ఏళ్ల కల సాకారం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్
- హర్షం వ్యక్తం చేస్తున్న పసుపు రైతులు
- జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని పసుపు రైతులు కేంద్రం సంక్రాంతి కానుక ప్రకటించింది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పచ్చ జెండా ఊపటమే కాదు.. ప్రారంభోత్సవ తేదీని కూడా ప్రకటించేసింది. అది కూడా సంక్రాంతి పండగ రోజున అంటే జనవరి 14వ తేదీనే పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు కేంద్రం ప్రకటన జారీ చేసింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని.. జనవరి 14వ తేదీన ఉదయం 10 గంటలకు నిజామబాద్‌లోని నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్‌లో

..మిగతా 2 లో

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్



- అందుపులోకి తీసుకున్న కరీంనగర్ పోలీసులు
- హైదరాబాద్ నుంచి కరీంనగర్ తరలింపు
- బూతులు తిట్టి.. చేయి చేసుకున్నాడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే సంజయ్
- రౌడీ షీట్ ఓపెన్ చేసే యోచనలో పోలీసులు
- ఇది అప్రజాస్వామికమన్న కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. ఓ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చి వెళ్తుండగా జూబ్లీహిల్స్‌లో కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కౌశిక్ రెడ్డిని కరీంనగర్ తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు సమాచారం. అనంతరం రిమాండ్‌కు తరలించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆదివారం నాడు కరీంనగర్ కలెక్టరేట్ సమీక్షా సమావేశంలో అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ పట్ల కౌశిక్ దురుసుగా

..మిగతా 2 లో



# 4 రోజుల్లో రూ.24 లక్షల కోట్లు ఫట్

- డీలాపడ్డ స్టాక్ మార్కెట్లు
- దెబ్బతీసిన చమురు ధరలు, రూపాయి పతనం
- 77,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్

..మిగతా 2 లో

## ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అభినందనలు

సైదాపూర్, విశాల భారతి

సైదాపూర్ మండలంలోని సోమవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఈనెల 18న కరీంనగర్ టౌన్ లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనిపించిన సర్వేందర్, లౌకిక ,కుష్మాంజల్, సరూప్ రావు ,సుశాంత్ ,సాయి వర్ధన్ విద్యార్థులను మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ ఉపాధ్యాయులు ఆదర్శ పాఠశాల య్యాల విష్ణువర్ధన్గౌడ్ లు అభినందించారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్

మొదటి పేజీ తరువాయి



వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఎమ్మెల్యే సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాదు స్పీకర్‌కు సైతం కంప్లైంట్ ఇచ్చారు. కౌశిక్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**రౌడీ షీట్ ఓపెన్..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం బిగ్ షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేసిన కౌశిక్ రెడ్డిపై పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కౌశిక్ రెడ్డిపై 3 వేర్వేరు కేసులు నమోదయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదుతో పాటు, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏ కంప్లైంట్ ఇచ్చారు. దీంతో పాడి కౌశిక్ రెడ్డిపై బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కేసులు ఫైల్ చేశారు. మరో ఫిర్యాదుపై కూడా 126 (2),115(2) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**అసలేం జరిగిందంటే..**

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మంత్రుల సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మంత్రుల సమక్షంలోనే ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నంత పని చేశారు. కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఇతర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. అయితే, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం తెలిపారు. సంజయ్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఇదే అంశాన్ని కౌశిక్ రెడ్డి నేటి మంత్రుల సమీక్షలో ప్రస్తావించారు. నువ్వు ఏ పార్టీ తరఫున గెలిచావు? ఆ తర్వాత ఏ పార్టీ లోకి వెళ్లావు?... అసలు నీ పార్టీ ఏది? అంటూ కౌశిక్ రెడ్డి... సంజయ్ పై మండిపడ్డారు. దాంతో, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం నెలకొంది. ఇరువురు నేతలు పరుష పదజాలంతో తిట్లు అందుకున్నారు. ఒకరినొకరు నెట్టుకునే వరకు వెళ్లింది. దాంతో అక్కడున్న నేతలు కౌశిక్ రెడ్డిని నిలువరించారు. ఈ దశలో పోలీసులు రంగప్రవేశం చేసి కౌశిక్ రెడ్డిని సమీక్ష సమావేశం నుంచి బయటికి తీసుకుని వెళ్లారు.

**కౌశిక్ రెడ్డి అరెస్టుపై కేటీఆర్ ఆగ్రహం**

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టుచేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. పూటకో అక్రమ కేసు పెట్టడం.. రోజుకో బీఆర్ఎస్ నేతను అన్యాయంగా అరెస్టుచేయడం రేవంత్ సర్కారుకు ఓ అలవాటుగా మారిందన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారని.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనకేసుకొచ్చి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఏకపక్షంగా అరెస్టుచేయడం పూర్తిగా అప్రజాస్వామికమని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో రైతురుణమాఫీని ఎగ్గొట్టి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకే ముఖ్యమంత్రి ఈ అణచివేత చర్యలకు దిగుతున్నారని.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డిపై చర్య తీసుకోవాల్సింది పోయి ప్రజల పక్షాన ప్రశ్నించిన కౌశిక్ రెడ్డిపై కేసులు పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. పోరాటాలే ఊపిరిగా పుట్టిన గులాబీ పార్టీ నేతల ఆత్మస్థయిర్యాన్ని ఇలాంటి చిల్లర చేష్టలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ దెబ్బతీయలేదని.. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# భక్తజనసంద్రంగా ప్రయాగ్‌రాజ్

మొదటి పేజీ తరువాయి

రాజ్ వద్ద త్రివేణి సంగమం ప్రదేశంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కోట్లాది మంది భక్తులు ఈ మహా కుంభమేళాలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. విదేశాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి స్నాన మాచరించే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల పూజలతో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగుతోంది. సోమవారం నుంచి ఫిబ్రవరి 26వరకు దాదాపు 45 రోజులపాటు జరిగే ఈ బృహత్తర క్రతువు కోసం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఈ మూడు నదులు కలిసే సమయం 144ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఈ కుంభమేళాకు మరింత విశిష్టత సంతరించుకుంది. ఇకపోతే ఈ కుంభమేళాకు 35 కోట్ల మంది హాజరయ్యే అవకాశం ఉందని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇకపోతే ఈనెల 29న మౌని అమావాస్య రోజున 4 నుంచి 5 కోట్ల మంది భక్తులు వచ్చి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే ఆదివారం 50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానం ఆచరించారు.

**ఉదయం 5.15 గంటలకు పుణ్యస్నానాలు మొదలు**

యావత్ భారతదేశం అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా2025 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ తెల్లవారు జామున 5.15 నిమిషాలకు పౌష్య పూర్ణిమ తిథి ప్రవేశించిన ఘడియలలో ఈ కుంభమేళా మొదలైంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ వద్ద త్రివేణి సంగమం ప్రదేశంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కోట్లాది మంది భక్తులు ఈ మహాకుంభమేళాలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ భారీ ఏర్పాట్లు చేసింది. విదేశాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి స్నాన మాచరించే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

**రూ.2 లక్షల కోట్ల ఆదాయం..**

45 రోజుల పాటు జరిగే మహాకుంభమేళా ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు రూ.2 లక్షల కోట్ల సంపదను సమకూర్చే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 40 కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో ప్రయాగ్‌రాజ్‌లో 4వేల హెక్టార్లలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం రూ.7వేల కోట్లు ఖర్చు చేసింది. 40కోట్ల మంది భక్తుల్లో ఒక్కొక్కరు రూ.5వేల ఖర్చు చేస్తే ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు 2 లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఒక్కో భక్తుడి సగటు ఖర్చు 10వేలకు కూడా చేరే అవకాశం ఉందని చెప్పారు. తద్వారా రూ.4 లక్షల కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. మహాకుంభమేళా వల్ల ఉత్తర్‌ప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్GSDP) 1 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. కోట్లాది మందికి ప్రత్యేకమైన రోజు: మోడీకుంభమేళా ప్రారంభంపై ప్రధాని మోడీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. "భారతీయ విలువలు, సంస్కృతిని ఆదరించే కోట్లాది మందికి చాలా ప్రత్యేకమైన రోజు. మహా కుంభ్ 2025 ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమవుతుంది. విశ్వాసం, భక్తి, సంస్కృతి యొక్క పవిత్ర సంగమంలోని లెక్కలేనన్ని మందిని ఒకచోట చేర్చింది. మహా కుంభ్ భారతదేశం యొక్క శాశ్వతమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. విశ్వాసం. సామరస్యాన్ని జరుపుకుంటుందని రాసుకొచ్చారు. అలాగే మరో ట్వీట్‌లో "ప్రయాగ్‌రాజ్‌కు లెక్కలేనంత మంది ప్రజలు రావడం, పవిత్ర స్నానం చేయడం ఆశీర్వాదం పొందడం చూసి నేను సంతోషిస్తున్నాను'' అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు.



### భక్తుల కోసం భారీ ఏర్పాట్లు

**మహాకుంభమేళాలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల కోసం కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా అనేక ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల నుంచి ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చిందిజ 13వేలకు పైగా ప్రత్యేక రైళ్లు ఆయా నగరాల నుంచి ప్రయాగ్ రాజ్‌కు రాకపోకలు సాగించనున్నాయి. మరోవైపు పౌర విమానయాన శాఖ సైత భారీ ఏర్పాట్లు చేసింది. ప్రయాగ్ రాజ్ విమానాశ్రయంలో రాత్రివేళ కూడాటేకాఫ్‌కు అనుమతులు ఇచ్చింది. ప్రయాగ్ రాజ్ ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీ, ముంబై, రాయ్‌పూర్,లక్నో, బెంగళూరు, భువనేశ్వర్, హైదరాబాద్, కోల్‌కతా, బిలాస్ పూర్ వంటి మహా నగరాలకు ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి పౌర విమానయాన సంస్థలు పలు ఫ్లైట్‌స్‌ను నడుపుతున్నాయి.**



# 4 పథకాలు.. రూ.45 వేల కోట్లు


మొదటి పేజీ తరువాయి

నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాల అమలుపై ఖమ్మం కలెక్టరేట్‌లోఉప ముఖ్యమంత్రి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు 22 వేల 500 కోట్లు, రైతు భరోసాకు18 వేల కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం అదనంగా ఖర్చు చేయాల్సి ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేర కట్టుబడి అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి పథకంపై సంపూర్ణంగా చర్చించిన తర్వాతే మార్గదర్శకాలు జారీ చేశామని స్పష్టం చేశారు. రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉండి భూమి లేని వ్యవసాయ కుటుంబాలు 20 రోజులు ఉపాధి హామీ పని చేసినట్లయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు అవుతుందని క్లారిటీ ఇచ్చారు.ప్రతి పథకానికి లబ్దిదారులను గ్రామ సభ పెట్టి పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులను భాగస్వామ్యం చేయాలని.. ప్రతి గ్రామ సభలో కార్యక్రమం పెట్టి ప్రభుత్వ లక్ష్యాలు తెలియజేయాలని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి చేత జాబితా ఆమోదింప చేసుకొని మంజూరు ప్రోసిడింగ్స్ అందజేయాలని తెలిపారు. ఎంత మంది రైతులకు ఎంత రుణమాఫీ జరిగింది, ఎంత మంది రైతు భరోసా వస్తుంది, బోనస్ వచ్చిన రైతుల వివరాలు తెలియజేస్తు గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల నిర్మాణం, మెస్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీల పెంపు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు 21 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని.. సన్న రకం ధాన్యం క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ అందించామని తెలిపారు.

# పెట్టుబడులే టార్గెట్

మొదటి పేజీ తరువాయి



సింగపూర్‌లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో.. గత ఏడాది దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాటి పురోగతిపై సోమవారం తన నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారులతో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గత ఏడాది దావోస్ ఒప్పందాల మేరకు ప్రాజెక్టులు ఏయే దశల్లో ఉన్నాయి? ఎన్ని ప్రారంభమయ్యాయి? అనే వివరాలను సీఎం రేవంత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తోందన్నారు. "ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులు తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయి. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది దావోస్ డబ్ల్యూఈఎఫ్‌లో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికారులు సీఎంకు ఆయా ప్రాజెక్టుల పురోగతిపై వివరణ ఇచ్చారు. 14 ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబుతో ఆయా కంపెనీల వారీగా పురోగతిని సీఎం చర్చించారు.

**విదేశాల్లో సుడిగాలి పర్యటనలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16నుంచి 19వరకు సింగపూర్, 20నుంచి 22వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.

# కులగణన సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డుల జారీ

మొదటి పేజీ తరువాయి

జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక్క ఆహార భద్రత కార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు చేయాలి. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి అర్హత ఉన్న కుటుంబాలు కొత్త ఆహార భద్రత కార్డులు పొందుతారని విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షన్నర, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షల లోపు ఆదాయం ఉండాలి.

# నేడు పసుపు బోర్డు ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి



జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్స కార్యక్రమం జరగనుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని లోక్ సభ ఎన్నికల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు కేంద్ర ప్రధాన కార్యాలయాన్ని నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కేంద్ర కేబినెట్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో.. సంక్రాంతి పండుగ రోజే పసుపు బోర్డు కేంద్ర ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనుంది. ఎక్కువ విస్తీర్ణంలో పసుపును పండించే తమ రాష్ట్రంలోనే పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని పెట్టాలని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడిని తెచ్చినప్పటికీ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు... నిజామాబాదులోనే బోర్డు కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా పసుపు రైతులు, బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

మరోవైపు.. జాతీయ పసుపు బోర్డు ఛైర్ పర్సన్‌గా నిజామాబాద్‌కు చెందిన పల్లె గంగారెడ్డిని నియమించింది. అంకాపూర్ గ్రామానికి చెందిన రైతు పల్లె గంగారెడ్డి.. ప్రస్తుతం బీజేపీలో సీనియర్ నేతగా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ మేరకు జనవరి 13న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి కానుకగా కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డుని కేవలం తెలుగు రాష్ట్రాలకే కాదు యావత్ దేశానికి అందిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. రేపటి (జనవరి 14) నుంచి పసుపు బోర్డు నిజామాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించనుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ దీన్ని ఏర్పాటు చేశారని కిషన్ రెడ్డి తెలిపారు.

# 4 రోజుల్లో రూ.24 లక్షల కోట్లు ఫట్

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావంతో వరుసగా నాలుగో రోజూ మన స్టాక్ మార్కెట్ డీలాపడింది. చమురు ధరలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ రికార్డు కనిష్ఠానికి పతనం కావడం మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీసింది. విదేశీ మదుపర్ల అమ్మకాలూ కొనసాగడంతో సెన్సెక్స్ 77,000 పాయింట్ల దిగువకు వచ్చింది. సోమవారం ఒక్క రోజే మదుపర్ల సంపద రూ.12.61 లక్షల కోట్ల మేర ఆవిరైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 66 పైసలు నష్టపోయి జీవనకాల కనిష్ఠమైన 86.70కు దిగివచ్చింది. రెండేళ్లలోనే ఒక రోజులో రూపాయి విలువలో అత్యధిక క్షీణత ఇది. బ్రెంట్ ముడి చమురు ధర 1.63% పెరిగి 81.06 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లు కూడా ప్రతికూలంగానే ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గత 4 ట్రేడింగ్ రోజుల్లో రూ. 24,69,243.30 కోట్లు తగ్గి రూ.4,17,05.906.74 కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది. డాలర్ల రూపేణ చూస్తే 5 లక్షల కోట్ల డాలర్ల దిగువకు వచ్చింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
14.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మునుగోడు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

మునుగోడు, విశాల భారతి

సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, రైతులు పాడి పంటలతో ఆయా రంగాల్లో శ్రేయస్సు సాధించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీకని ఈ పండుగ అందరిలో స్నేహభావం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలని తెలిపారు. ప్రజలందరూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో పాటు, స్వీయ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని అందరూ హెల్మెట్, సీట్ బెల్ట్ వాడుతు ప్రయాణాలు చేయాలని సూచించారు. పండుగ ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆనందం నింపాలని, సుఖ సంతోషాలతో నిండిన జీవితం గడపాలని మునుగోడు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు ఆకాంక్షించారు.

## కాలనీల అభివృద్ధి అందరి బాధ్యత

- కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట, విశాలభారతి



కాలనీల అభివృద్ధి అందరి భాద్యత అని కాంగ్రెస్ రాష్ట్ర 1నాయకులు,సూర్యాపేట పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణం లో ని సుగుణ స్మార్ట్ సిటీ లో 32 సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాలనిలో ఉన్నా వారందరు కలసి కట్టుగా ఉన్నపుడు సమస్యలు పరిష్కారం అవుతాయాన్నారు. కాలనీ డెవలపర్స్ సహకారం తో 4 లక్షల ఖర్చు తో కాలానివాసుల భద్రత కొరకు సీసీ కెమెరాల్లు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమం అని పేర్కొన్నారు. సుగుణ స్మార్ట్ సిటీని అన్ని కాలనిలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని, ఓపెన్ జిమ్ మంజూరు కోసం కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సుగుణ స్మార్ట్ సిటీ అధ్యక్షులు దామిడి రమేష్ రెడ్డి, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కే. శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండి అంజద్ అలీ,కాలనివాసులు బిక్షపతి, ధనమూర్తి,సుదర్శన్ రెడ్డి, మిర్యాల అమృత రెడ్డి, మందడి వెంకట్ రెడ్డి, కొండలరావు, పూరషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బంజర మల్లన్నకు జోగు బ్రదర్స్ ఘనంగా పూజలు

దేవరుప్పల, విశాల భారతి

దేవరపుల మండలం బంజర గ్రామంలో బంజర మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రంలో ముఖ్యఅతిథిగా ఏసిపి అంబటి నరసయ్య సిఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్ ఐ సృజన్ కుమార్ విచ్చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాతరకు మేము పూర్తి సెక్యూరిటీని మరియు సిసి కెమెరాలు, నిర్వహించి, శాంతిభద్రతలతో జరిగేలా మేము మీకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ప్రతి సంవత్సరం బంజర గ్రామ మల్లికార్జున స్వామి ఆలయంలో భోగి సంక్రాంతి సందర్భంగా జాతర నిర్వహించటం జరుగుతుంది. ఈ జాతరకు చుట్టుపక్కల ఉన్న మండలాల నుండి భక్తులు భక్తిశ్రద్ధలతో విచ్చేసి భోగి రోజు బోనాలు సంక్రాంతి రోజు జాతర నిర్వహించి తమ కోరికలను మల్లికార్జున స్వామికి మెక్కులతో దర్శించి వారి యొక్క కోరికలను నెరవేర్చుకుంటారు. ఈ జాతర పెద్దమడూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి జోగు బిక్షపతి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహింస్తారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మా తాతగారైన జోగు గౌరప్పకు గత 195 సంవత్సరాల క్రితం కలలో వచ్చి మల్లికార్జున స్వామి నన్ను పూజించు అని అనగా తంగేడు తడకలతో గుడిని నిర్మించి, పుట్టమన్నుతో మల్లికార్జున స్వామిని తయారుచేసి, ప్రతిష్టించి పూజలు జరిపించడం గత సంవత్సరాలనుండి జరుగుతున్న ఆనవాయితీ, ఈ జాతరకు భోగి రోజు బోనాలు నిర్వహిస్తాము సంక్రాంతి రోజు జాతర జరుగుతుంది అన్నారు. కొమురవెల్లి, ఐలోని దేవస్థానాల లో విగ్రహాలతో నిర్వహించిన మల్లికార్జున స్వామికి పూజిస్తారు. ఇక్కడ మాత్రం పుట్టమన్నుతో చేసిన మల్లికార్జున స్వామిని ప్రతి సంవత్సరం తయారు చేసి పూజలు ఘనంగా నిర్వహిస్తాము అన్నారు. ఇన్ని సంవత్సరాల నుండి భక్తులు కోరుకున్న కోరికలు తీరుస్తూ ఎంతో భక్తి శ్రద్ధలతో మల్లికార్జున స్వామిగా కొలువబడుతున్నాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జోగు సోమయ్య, నరసయ్య, కైలాసం, కొమురయ్య, కుమార్, నరసింహ, పాండు, రాములు, మల్లేష్, ప్రతినిధులు, నాయకులు, వివిధ గ్రామాల నుండి ప్రజలు భక్తులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని, ఇందిరమ్మ ఇళ్లపై ఆరా కూడా తీస్తారన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. భవనాలున్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని తేల్చి చెప్పారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో నేడు జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి వుంటుందని తేల్చి చెప్పారు. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దని అంటూ, గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండని మంత్రి సూచించారు.

అలాగే, ప్రజాపాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు ఈనెల 26 నుంచి అమలు చేస్తామన్నారు. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తామన్నారు. రెవెన్యూ మంత్రి కూడా ఖమ్మం జిల్లా వ్యక్తేనని, ఆయన దగ్గర ఉండి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.





# కొత్తకొండ కొరమీసాల స్వాములోరికి కోటి మొక్కులు

- కొత్తకొండ బ్రహ్మోత్సవాలలో
- కిక్కిరిసిన భక్తజనం
- అట్టహాసంగా ప్రారంభమైన కుమ్మరి బోనం
- వీరభద్రున్ని దర్శించుకున్న సెంట్రల్ జోన్ డిసిపి సలీమా

విశాలభారతి, భీమదేవరపల్లి :

మకర సంక్రాంతి పండుగ భోగితో మొదలవుతుంది. మకర సంక్రాంతి పండగకు ముందు భోగి పండుగను ఘనంగా జరపుకుంటారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా భోగి రోజు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. గత సంవత్సరం కంటే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భోగిని పురస్కరించుకుని సోమవారం ఆలయంలో జాతర వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు కొత్తకొండ గ్రామానికి చేరుకుని, వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా కుమ్మరి బండి:**
కడిపికొండ, ఉల్లిగడ్డ దామెర నుంచి ప్రత్యేక ఎద్దుల బండి ఊరేగింపులో కుమ్మర సామాజికవర్గానికి చెందిన వారు రావడంతో బండ్లు తిరుగుడు ప్రారంభమవుతుంది. వీరభద్ర స్వామికి భోగి రోజు కుమ్మరి వీరబ్రహ్మంతో గుడి చుట్టూ ప్రదక్షిణలతో కుమ్మరి వాళ్లు శివసత్తులు, వీర ఖడ్గాలతో ఓం వీరభద్రాయ నమః అంటూ, కుమ్మరి బోనం చుట్టూ తిరుగుతూ, ఆలయ ఈవో కిషన్ రావు, పాలక మండలి ధర్మకర్తలు మరియు చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, సీఐ పులి రమేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**మతసామరస్యానికి ప్రతీకగా డీసీపీ సలీమా:**
కొత్త కొండ వీరభద్రుని సన్నిధిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సెంట్రల్ జోన్ డిసిపి సలీమా, గుమ్మడికాయ నెత్తిన పెట్టుకొని, ఆలయ ప్రదక్షిణలు చేసి, వీరభద్రుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీపీ సలీమా మతసామరస్యానికి చిహ్నంగా నిలిచారు. అనంతరం పోలీస్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

**కోర మీసాలోరికి కోడె మొక్కులు:**
వీరభద్రస్వామికి ప్రత్యేక మహిమలు ఉన్నట్లు భక్తుల నమ్మకం. సంతానం లేనివారు స్వామి వారికి కోరమీసాలు సమర్పించుకుంటే తప్పక పుత్ర సంతానం కలుగుతుందని నమ్మకం. అందుకే సంతానం లేని వారంతా కోరమీసాలు సమర్పిస్తుంటారు. అలాగే కోడెను కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే చేసిన పాపాలు తొలగిపోయి అష్ట ఐశ్వర్యాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం.




## ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది ప్రతి పేద కుటుంబానికి చేరాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, సమన్వయంతో ప్రతి పేదకు లబ్ధి చేరేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సితక్క, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల అమలు క్రమాన్ని చర్చించారు.

**పథకాల ప్రయోజనాలు:**
రైతు భరోసా పథకం: వ్యవసాయ భూముల కల్పనకు సంబంధించి ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.12,000 సహాయం అందించనుంది.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా: భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రత్యేక ఆర్థిక సహాయం.ఇందిరమ్మ ఇండ్లు: ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు నిర్మించేందుకు మద్దతు.కొత్త రేషన్ కార్డులు: అర్హులైన కుటుంబాలకు కార్డుల జారీతో నిత్యావసర సరుకుల సరఫరా.ప్రతి గ్రామ సభలో అధికారుల సమగ్రమైన పరిశీలనతో అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పథకాలపై ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నాలుగు ప్రధాన సంక్షేమ పథకాల అమలును ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామసభల నిర్వహణను విజయవంతం చేయడంలో అధికారులు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

**గ్రామ సభలు నిర్వహణ:**
రాష్ట్ర ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తించేందుకు గ్రామ, వార్డు సభలను నిర్వహించాలని, ఈ సమావేశాల ద్వారా లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించాలని సూచించారు. గ్రామస్థాయిలో పర్యటించే బృందాల్లో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## పెళ్లి పేరుతో న్యూడ్ వీడియో కాల్స్

- మ్యాట్రిమోని సైట్లతో జాగ్రత్త
- యువతీయువకులకు సజ్జనార్ సూచన

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిబంధనలు తీసుకొచ్చిన ఆన్‌లైన్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ రూపాల్లో కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులను టార్గెట్ చేస్తూ అడ్డగోలుగా దోచేస్తున్న దుండగులు తాజాగా వివాహ వేదికలపై కన్నేశారు. పెళ్లి సంబంధాల పేరిట యువతీయువకులను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.కాదంటే న్యూడ్ వీడియోలు పంపించి బెదిరింపులకు పాల్పడుతున్న ఘటన మ్యాట్రిమోనిలో వెలుగులోకి రాగా.. ఈ విషయాన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**న్యూడ్ వీడియో కాల్స్..**
ఈ మేరకు మ్యాట్రిమోని సైట్లలో అందమైన యువతీయువతుల ఫొటోలతో నకిలీ ప్రొఫైల్స్ క్రియేట్ చేస్తున్నట్లు ఓ అమ్మాయి వివరించిన వీడియోను షేర్ చేశారు సజ్జనార్. పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి న్యూడ్ వీడియోలతో బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్నారు. అడిగినంతా డబ్బు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. మ్యాట్రిమోని సైట్ల కేంద్రంగా ఈమధ్య పెరిగిపోతున్న మోసాలను గమనించాలి. న్యూడ్ వీడియోల వ్యవహారం బయటకి వస్తే పరువు పోతుందనే భయంతో ఫిర్యాదుకు జంకుతున్న బాధితులు.. ఆత్మ హత్యలకు సైతం పాల్పడుతున్నారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిచయమైన యువతి, యువకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీడియో కాల్స్ చేయమన్నా, న్యూడ్ ఫోటోలు అడిగిన కచ్చితంగా అనుమానించాల్సిందే. మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 నబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండని సూచించారు.

## డ్రగ్స్ తరలిస్తున్న నలుగురు యువకుల అరెస్టు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



బెంగళూరు నుంచి నగరానికి మాదకద్రవ్యాలు తీసుకొచ్చిన నలుగురు యువకులను ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్ సమీప జిల్లెలగూడ గౌతంనగర్‌కు చెందిన తెనుగు అజయ్, కర్మన్‌ఘాట్ పద్మానగర్‌కు చెందిన గడికాన మహేందర్ కుమార్, సూర్యాపేట విద్యానగర్ కాలనీకి చెందిన గండూరి జఫన్యారాజ్ అలియాస్ రికీ, సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన దాసరి విల్సన్ అలియాస్ రాజు స్నేహితులు. వీరంతా మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. బెంగళూరులో ఎండీఎంఏ డ్రగ్ కొనుగోలు చేసి, రైలులో నగరానికి తీసుకొచ్చారు. ఎల్బీనగర్ కామినేని చౌరస్తా సమీపంలో సోమవారం ఎస్‌వోటీ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 5 గ్రాముల ఎండీఎంఏ, నాలుగు ఫోన్లు, ఓ కారు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
14.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# శివశక్తి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో భోగి వేడుకలు

- 13అడుగుల విస్తీర్ణంలో 30అడుగుల ఎత్తులో భోగి మంటలు
- పెద్ద ఎత్తున హాజరై వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్న కాలనీవాసులు

**కూకట్ పల్లి,విశాలభారతి:**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ 3వ ఫేసు రమ్యగ్రౌండ్ లో పెద్ద ఎత్తున భోగి మంటలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కెపిహెచ్బి కాలనీ డివిజన్లోని ప్రజలందరూ ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా వేయలేనటువంటి భోగి మంటలు రమ్య గ్రౌండ్ లో చేయడం ఎంతో సంతోషంగా ఉందనీ,13 అడుగుల విస్తీర్ణంతో 30 అడుగుల ఎత్తులో భోగి మంటల వేదికని తయారు చేయడం జరిగిందని కట్ట తెలిపారు.హిందూ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని రమ్య గ్రౌండ్ లో జరుపుతున్నామని శివశక్తి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట నర్సింగ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు రమ్యగ్రౌండ్ మిత్రబృందం సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలి

**నాచారం,విశాలభారతి:**



మల్లాపూర్ జిహెచ్ఎంసి గ్రౌండ్లో భోగి పండుగను పురస్కరించుకునీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాసుతో కలిసి గాలిపటాలు ఎగరవేశారు. అనంతరం తన చిన్ననాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, పతంగులను ఎగిరే వేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.





# ముగ్గులకు సంస్కృతి సంప్రదాయాల్లో ఎంతో విశిష్టత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆబేద్, మేరాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**పటాన్ చెరు,విశాలభారతి:**

ముగ్గులకు హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో ఎంతో విశిష్టత ఉందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం పటాన్ చెరు మండల పరిధిలోని ముత్తంగి సాయి ప్రియ కాలనీలో సీనియర్ నాయకులు ఆబేద్, మేరాజ్ ఖాన్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మహిళల కోసం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పండగ విశిష్టతను ప్రతిబింబించేలా ముగ్గులు వేయడం పట్ల ఆయన మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీలలో పాల్గొన్న 126 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, రామ కృష్ణ, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

- బాలానగర్ సీఐ

**కూకట్ పల్లి, విశాలభారతి:**




తెలుగు వారి పండుగ సంక్రాంతి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ బాలానగర్ సీఐ నర్సింహా రాజు శుభాకాంక్షలు తెలిపారు.కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు.ఈ సంక్రాంతి సుఖసంతోషాలను,భోగభాగ్యాలను కనుమ కమనీయమైన అనుభూతులను అందించాలని, స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని కోరారు. పతంగులు ఎగరవేసేటప్పుడు పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# రతన్ టాటా అవార్డు గ్రహీత భేరి రామచందర్ యాదవ్ కు ఘన సన్మానం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

సామాజిక సేవ రంగాల్లో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న భేరీ రామచందర్ యాదవ్ కు ప్రతిష్టాత్మకంగా ఇచ్చే రతన్ టాటా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికూడ రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో షాద్ నగర్ బైపాస్ రోడ్డులోని యాదాద్రి గ్రాండ్ హోటల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నడికూడ రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు, బీసీ సామాజిక వర్గాలకు అనునిత్యం వెన్నంటే ఉండి, వారి యొక్క అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ, అనునిత్యం ప్రజాసేవయే తన లక్ష్యమని, నిరంతరం బడుగు బలహీన వర్గాలకు కోసం శ్రమిస్తున్న రతన్ టాటా అవార్డు గ్రహీత భేరి రామచందర్ యాదవ్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం చిన్నయ్య గారి వెంకటేష్ యాదవ్, భేరి రామచందర్ యాదవ్ ను భగవద్గీతతో పాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ భగవద్గీత మనకు నిత్య సత్యాన్ని చూపుతోందని, ప్రతి హిందువులు భగవద్గీతలోని శ్లోకాలను ఇళ్లలో వినాలని సూచించారు. భగవద్గీత విశిష్టత తెలిసేలా పాఠ్యాంశాలలో చేర్చి విద్యార్థులకు బోధించాలని తెలిపారు. ప్రకృతిలో సంభవించే ప్రతి ఒక్క కార్యంలో శ్రీకృష్ణుని పాత్ర కీలకంగా ఉంటుందని శ్రీ కృష్ణుడు బోధించిన భగవద్గీత మార్గంలో నడుస్తూ సన్మార్గాన్ని పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, షాద్ నగర్ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు నక్క బాల్ రాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, యాదవ యువత జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ దావాజీ శ్రీనివాస్ యాదవ్, నందిగామ మండల అధ్యక్షుడు తుమ్మల జగన్ యాదవ్, చిన్నయ్య గారి వెంకటేశ్ యాదవ్, రాజు యాదవ్, నడికూడ మహేందర్ యాదవ్ పాల్గొని ఘనంగా సన్మానించారు.




# మాజీ ఎంపీ మంద జగన్నాథం పార్థివ దేహానికి నివాళులర్పించిన మధుయాష్కీ గౌడ్

- మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు లతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న మధుయాష్కీ గౌడ్.

**ఎల్బీనగర్, విశాలభారతి:**

అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ ఎంపీ మంద జగన్నాథం పార్థివ దేహాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. మందా జగన్నాథం పార్థివ దేహం చూసిన మధుయాష్కీ కన్నీరు పెట్టుకున్నారు. ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. జగన్నాథం పాడే మోసిన మధు యాష్కీ,మంత్రులు జూపల్లి కృష్ణారావు , పొన్నం ప్రభాకర్ , ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ , ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య , మాజీ ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తనకు జగన్నాధం ఎంతో ఆత్మీయుడని పేర్కొన్నారు. ఆయనతో కలిసి ఎంపీగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను పార్టీ అధిష్టానానికి తీసుకువెళ్లి ఒత్తిడి చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఏర్పాటుకు పార్టీ ఎంపీలుగా మేమందరం అధిష్టానాన్ని ఒప్పించామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ప్రజల ఆకాంక్షల కోసం తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి పోరాడారని వివరించారు. ఆయన సేవలను ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉంటామని పేర్కొన్నారు.

# స్మశాన వాటిక నిర్మాణ పనుల పరిశీలన

- చైర్ పర్సనల్ పండుగల జయ శ్రీ రాజు, కౌన్సిలర్లు దండెం కృష్ణ రెడ్డి, బొర్ర అనురాధ సురేష్

**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**



పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పసుముల రోడ్డుకు ఉన్నటువంటి హిందూ స్మశాన వాటికలో 40 లక్షల రూపాయలతో జరుగుతున్నటువంటి స్నానాల గదుల నిర్మాణ భవనాన్ని చైర్ పర్సనల్ పండుగల జయశ్రీ రాజుతో పాటు కౌన్సిలర్లు దండెం కృష్ణ రెడ్డి,బొర్ర అనురాధ సురేష్ లు ఆదివారం పరిశీలించారు. స్మశాన వాటిక నందు వస్తున్నటువంటి ప్రజలు దహన కార్యక్రమాలు చేసిన తర్వాత స్నానాలు చేయడం హిందూ సాంప్రదాయంలో ఆనవాయితి. ఆ ఆనవాయితి ప్రకారం ఇక్కడ స్థానాలు చేయడం కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు.ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్థానాల గదిలో నిర్మాణం చేయడం జరుగుతుందని చైర్ పర్సన్ తెలిపారు. ఇక్కడికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడడము మా పై ఉన్న బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, కాంట్రాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- పార్టీ ప్రమాద భీమా చెక్ అందజేసిన
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండ, విశాల భారతి**

బీఆర్ఎస్ పార్టీ ప్రమాద భీమా చెక్కును కార్యకర్త కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన పార్టీ మహిళ కార్యకర్త ఆకుల లావణ్య ఇటివలే రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమెకు పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల విలువగల చెక్కును ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వారి భర్త ఆకుల లింగన్నకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే వారి కుటుంబానికి అండగా ఉండటానికి ప్రమాద భీమా సౌకర్యం కల్పించారన్నారు. రాష్ట్రంలో 60 లక్షల పైచిలుకు మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారని,బలమైన కార్యకర్తలు గల పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు.భీమా కోసం దాదాపు 11 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు కార్యకర్తల కోసం చెల్లిస్తున్న పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది కార్యకర్తలు సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. ఇప్పటికీ నియోజకవర్గంలో 52 మంది కార్యకర్తలకు 2 లక్షల చొప్పున పార్టీ ప్రమాద భీమా చెక్కులు వారి కుటుంబాలకు అందజేయడం జరిగింది అని అన్నారు.కుటుంబ పెద్దను కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు 2లక్షల చెక్కుతో ఆర్థికంగా కొంత ఊరట కలుగుతుంది తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యా సాయి గంగారెడ్డి,మహేష్,బాశెట్టి గంగాధర్,ప్రశాంత్,నాయిక దేవేందర్,తిరుపతి పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కొత్తకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా డిఎంహెచ్వో అప్పయ్య
- 36 మంది పారా మెడికల్ సిబ్బందితో 3 షిఫ్టులు
- అత్యవసర సేవలు అందించేందుకు రెండు 108 వాహనాలు

**భీమదేవరపల్లి, విశాల భారతి, :**




కొత్తకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలను ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. డాక్టర్లు, 36 మంది పారామెడికల్ సిబ్బందిని మూడు షిఫ్టులలో డ్యూటీలు వేస్తున్నామని అన్నారు. అలాగే అత్యవసర సేవల నిమిత్తం రెండు 108 సర్వీసులని కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను అందించామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి. ప్రదీప్ రెడ్డి, డా. అశోక్ రెడ్డి, డాక్టర్ ఎస్. మౌనిక, డాక్టర్ ఎస్. వినోద్ కుమార్, హెచ్ఈవో ఎస్ రాజేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ విమల కుమారి, విప్లవ కుమార్, ఏఎన్ఎం అనిత, ఆశాలు, ఎమ్మెల్వోలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
14.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# సూర్యాపేట జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, విశాలభారతి



జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేట జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, రైతులు పాడి పంటలతో తులతూగి, ఆయా రంగాల్లో శ్రేయస్సు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీకని ఈ పండుగ అందరిలో స్నేహభావం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలని తెలిపారు. ప్రజలందరూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో పాటు, స్వీయ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఆందరు హెల్మెట్ ,సీట్ బెల్ట్ వాడుతు ప్రయాణాలు చేయాలని సూచించారు. పండుగ ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆనందం నింపాలని, సుఖ సంతోషాలతో నిండిన జీవితం గడపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కోదాడ, విశాలభారతి:



కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నియోజకవర్గ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలచలం నరేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా కొలిచలం నరేష్ ను నియమించినందుకు సూర్యాపేట జిల్లా టియుడబ్ల్యూజే 143 యూనియన్ అధ్యక్షులు వజ్జే వీరయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. యూనియన్ జిల్లా నాయకుల ఆదేశాలతో ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి నాకు ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టియుడబ్ల్యూజే 143యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారపరాజు హరి కిషన్, టీయూడబ్ల్యూజే 143 యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్, నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు సలహాలు సూచనలతో యూనియన్ బలోపేతంలో భాగంగా ముందుకు కొనసాగుతానన్నారు.

# మంద జగన్నాథం సేవలను, మరువలేం

పెద్ద అంబర్ పేట,విశాలభారతి:



నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం ఆదివారం మరణించారు. విషయం తెలిసిన వెంటనే గ్యార నర్సింహా వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు జగన్నాథం లేరనే వార్త తెలిసి ప్రజలు దిగ్భంతి చెందరాని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్లమెంట్ సభ్యునిగా మంద జగన్నాథం చేసిన సేవలను,మరువలేమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూన్నట్లు తెలిపారు.





# మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- ఇస్నాపూర్ మత్స్యకారులతో నీలం మధు సమావేశం
- మత్స్యకారుల సమస్యలపై మంత్రి కొండా సురేఖకు లేఖ అందిద్దాం

పటాన్ చెరు, విశాలభారతి

మత్స్యకారుల సంక్షేమానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఇస్నాపూర్ మత్స్యకారులతో భేటీ సందర్భంగా వారు గత కొన్ని సంవత్సరాలుగా మత్స్యశాఖలో సభ్యత్వం మరియు కాలుష్యం వలన జీవనోపాధి సమస్యపై నీలం మధుతో చర్చించారు, ఈ విషయంపై నీలం స్పందిస్తూ కొంత కాలం ముందే ఈ సమస్యపై తాను డీఫ్ఓ,పీసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అని అధికారులు పరిష్కార చర్యల దిశగా అడుగు లేస్తున్నారని మరియు ఇస్నాపూర్ గ్రామంలో నూతన సంఘం ఏర్పాటుకు సహకరించడం జరిగింది అని గుర్తుచేశారు.నీలం మధు మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక వాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా ఇస్నాపూర్, చిట్కుల్ ప్రాంతంలో చెరువులు విషపూరితంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాలు చెరువులో కలవడం వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలో చాలా చెరువులలో చేపల పెంపకం చేయలేకపోతున్నారు అని మరియు కొన్ని చెరువులలో చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని, సంబంధిత మంత్రి కొండా సురేఖ గారికి లేఖ ఇద్దామని తెలిపారు. ఏ ఏ పరిశ్రమల ద్వారా చెరువులకు నష్టం జరుగుతుందన్న విషయాన్ని నిగ్గు తేల్చేందుకుగాను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రికి సంక్రాంతి తర్వాత విన్నవిద్దామన్నారు. దానికి తోడు కొన్ని చెరువుల్లో కాలుష్యం వల్ల చేపల పెంపకనికి అనువుగా లేకపోవడంతో ఇక్కడ మత్స్యకార సభ్యులకు సొసైటీలో సభ్యత్వం కల్పించే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. దీంతో ఇక్కడ మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలలో అర్హత సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాశమైలారం పారిశ్రామికవాడలో నెలకొన్న ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడి మత్స్యకారులను ప్రత్యేకంగా గుర్తించి జిల్లా మత్స్యకార సహకార సంఘంలో సభ్యులుగా చేర్చుకోవాలని గతంలోనే తీర్మానించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని నాయకుల సహకారంతో ఈ విషయంలో ఇప్పటికే ముందడుగు వేసామని వివరించారు. త్వరలో చెరువుల కాలుష్యానికి సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో పూర్తి సర్వే నిర్వహించి విష జలాలను విడుదల చేస్తూ చెరువుల కాలుష్యం, జీవనోపాధి లేకపోవడానికి మరియు చేపల మృతికి కారణమవుతున్న పరిశ్రమలను గుర్తించి వాటి ద్వారా మత్స్యకారులకు ప్రతి సంవత్సరం నష్టపరిహారాన్ని అందించే విధంగా పీసీబీ సిఫార్సుకు కృషి చేస్తామన్నారు. చేపల పెంపకానికి అనువు కానీ చెరువుల ప్రాంతాలలోని మత్స్యకారులను ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని పథకాలకు వారిని అర్హులు చేసే విధంగా నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తామన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నీలం మధు స్పష్టం చేశారు. మత్స్యకారుల సభ్యత్వ, జీవనోపాధి విషయంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని గ్రామస్థులు ఈ సందర్భంగా తెలియచేశారు,ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు మన్నే రాఘవేందర్, పెంటయ్య, నర్సింలు, వెంకటేశ్, గోపాల్, రవి, మల్లేష్, మనోహర్, శ్రీనివాస్, మల్లేశం, మణికంఠ పాల్గొన్నారు.



# ఐక్యంగా సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్

కోదాడ, విశాలభారతి:

పల్లెల్లో ప్రజలందరూ ఐక్యంగా ఉంటూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ పిలుపునిచ్చారు. మునగాల మండలం నరసింహులగూడెంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సిపిఎం, డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహుల గూడెం అమరవీరుల జ్ఞాపకార్థం ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్, టీవీలు వచ్చి గ్రామాలలో సోషల్ మీడియా ద్వారా ప్రజల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తున్న నేటి తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో పండుగల సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడటం కోసం ఇలాంటి ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నరసింహులగూడెం గ్రామంలో ప్రజలందరినీ ఏకతాటిమీదికి తెచ్చి పండుగల సందర్భంగా ముగ్గుల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం సిపిఎం పార్టీకి సాధ్యమని అన్నారు. గ్రామంలో పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ముదిరెడ్డి ఆదిరెడ్డి, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంత శ్రీనివాస రెడ్డి, జూలకంటి పులిందర్ రెడ్డి ముందు భాగంలో ఉన్నారని అన్నారు. యువజన సంఘం పేరుతో గ్రామాలో కబడ్డీ పోటీలు నిర్వహించి గ్రామీన క్రీడలను ప్రోత్సహించారని అన్నారు. నాటి అమరవీరులు చూపిన బాటలో పయనిస్తూ వారి ఆశయ సాధన కోసం ముందుకు సాగుతూ అనేక ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమపంగు నర్సయ్య అధ్యక్షత వహించగా ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, నరసింహులగూడెం గ్రామానికి చెందిన క్లాస్ 1 సివిల్ కాంట్రాక్టర్ కుంచం నరసయ్య, సిపిఎం అనంతగిరి మండల కార్యదర్శి రాపోలు సూర్య నారాయణ, సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి జూలకంటి కొండారెడ్డి పాల్గొన్నారు.

# యువత ఐక్యత కోసమే గ్రామీణ క్రీడలు

- ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్దింటి రంగారెడ్డి
- ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు

నూతనకల్, విశాలభారతి:



సంక్రాంతి సందర్భంగా చిల్పకుంట్ల గ్రామంలో (పిడిఎస్యు) (పి వై ఎల్) గ్రామ కార్యవర్గాల ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంద్భంగా పిడిఎస్యు జెండాను జటంగి బన్నీ , పివైఎల్ జండా కూసు లింగరాజు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్దింటి రంగారెడ్డి, ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు పాల్గొని మాట్లాడుతూ క్రీడలు శారీరిక ఉత్సాహానికి ఉల్లాసానికి తోడ్పడతాయని అన్నారు. ప్రతి సంవత్సరం చిల్పకుంట్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. రెండు రోజుల జరిగే క్రీడా పోటీలలో యువకులు, మహిళలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,చిల్పకుంట్ల గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ జటంగి విరమల్లు, జటంగి సౌనయ్య, ఉప్పుల మానికుమార్ ,కూసు ఉప్పలయ్య, కూసు పరమేష్, క్రాంతి, శీను, తదితరులు పాల్గొన్నారు



# మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్న లయన్స్ క్లబ్

శాలిగౌరారం,విశాలభారతి:

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నల్గొండ,ఖమ్మం ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ 2 కేవి ప్రసాద్ అన్నారు. శాలిగౌరారంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్ ఎస్ఎల్ఎన్ స్వామి షాపింగ్ మాల్ సహకారం తో మండల స్థాయిలో జరిగిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి గా కేవీ ప్రసాద్ పాల్గొని మహిళా విజేతలకు చీరలు అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలు కు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి వారికి కుట్టు మిషన్ లను అందజేసిఉపాధి కలిపి పిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ, సంక్రాంతి పండుగలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు.ప్రపంచం లోనే 220 దేశాల్లో లయన్స్ క్లబ్ ద్వారా కోట్లాది మంది కి సేవలు అందిస్తూమన్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ సేవలు అందిచడంలో అగ్రగ్రామికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోడే సతీష్,ఎస్ఎల్ ఎన్ స్వామి షాపింగ్ మాల్ ఎండీ గట్టు శ్యామ్ సుందర్,పాస్ట్ జోన్ ఛైర్మెన్ యర్ర శంబు లింగా రెడ్డి, చైత్ర ఫాండేషన్ ఛైర్మెన్ యంగలి రామకృష్ణ గౌడ్, చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షులు డెంకల సత్య నారాయణ, శేఖర్ బాబు పాల్గొన్నారు



# స్నేహితులకు అండగా నిలిచిన బాల్యమిత్రులు

శాలిగౌరారం, విశాలభారతి:

మాదావరం (కాలన్) గ్రామానికి చెందిన జేరిపోతుల సంతోష్ తండ్రి ఇటివల అనారోగ్యంతో మరణించాడు. సంతోష్ బాల్య మిత్రులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.ఈ సందర్భంగా 20072008 జడ్పీహెచ్ఎస్ మాధవరం (కలాన్) పదవ తరగతి బాల్య మిత్రులందరి సహకారంతో దాసరి శ్రీనివాస్ కు సోమవారం వైద్య ఖర్చులకోసం ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వేముల గోపీనాథ్,తీగల గోవర్ధన్,జేరిపోతుల నరేష్, నోముల మధు,కట్లకుంట్ల రవి, గద్దగూటి మహేష్ ,బొడ్డు పరమేష్,మెట్టు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పట్టణ అధ్యక్షురాలుగా బుక్యా మంగమ్మ లింగం నాయక్

డోర్నకల్, విశాలభారతి:



బీజేపీ మరిపెడ మండల, పట్టణ అధ్యక్షురాలును ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ సిఫార్సు మేరకు బిజెపి మహబూబాబాద్ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి నెల్లీ శ్రీవర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ మరిపెడ పట్టణ అధ్యక్షురాలుగా బుక్యా మంగమ్మ ఎన్నికైనట్లు శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. బుక్యా మంగమ్మ నాయక్ నరేంద్ర మోడీ నాయకత్వానికి, మచ్చలేని పరిపాలనను చూసి నిజాయితీగా కష్టపడి పార్టీ అభివృద్ధికి పనిచేయటం జరిగింది. పనిచేసే వాళ్లకు గుర్తింపు ఉంటుందని రుజువైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బుక్యా మంగమ్మ నాయక్ మరిపెడ పట్టణ అధ్యక్షురాలుగా ఎంపిక కావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం నిరంతరం నిస్వార్థంగా కష్టపడటాన్ని గుర్తించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వం మండల అధ్యక్షురాలుగా నియమించి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా బుక్యా మంగమ్మ నాయక్ మాటా డుతూ.. తనని భాజపా మరిపెడ పట్టణ అధ్యక్షురాలుగా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి, సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# భోగిపండ్ల సందడితో తెడ్ల వినిక్ష

అడవిదేవులపల్లి, విశాలభారతి:

భోగి రోజున చిన్నారుల తలపై భోగి పండ్లు ఎందుకు పోస భోగి పండగ రోజున పిల్లలకు భోగి పళ్లు పోయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భోగి పండ్లను చిన్న పిల్లల తలపై పోస్తారు. భోగిపండ్లుగా రేగుపండ్లను ఉపయోగిస్తారు. అయితే పిల్లలకు భోగి పళ్లు ఎందుకు పోస్తారు? ఈ సాంప్రదాయం వెనుక ఉన్న ఆంతర్యం, పురాణ కథ ఏమిటో తెలుసుకుందాం..తెలుగువారు జరుపుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండగను తెలంగాణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమగా ఘనంగా జరుపుకొంటారు. దక్షిణాయణం చివరి రోజున భోగిగా జరుపుకుంటారు. సంక్రాంతి అంటే కొత్త అల్లుళ్ళు, సినిమాలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దులు, పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, కోడి పందాలు వంటి సందడి. మొదటి రోజుని భోగిగా జరుపుకుంటారు. భోగ భాగ్యలను ఇచ్చే భోగి రోజున అభ్యంగన స్నానాలు చేసి భోగి మంటలు వేసి ఆవు పేడతో చేసిన పిడకలను ఆ మంటల్లో వేసి పండగను జరుపుకుంటారు. ఎముకలు కొరికే చలిని తరిమి కొడతారు. సాయంత్రం చిన్న పిల్లలకి భోగి పళ్ళు దిష్టి తీసి భోగిపళ్ళు పోస్తారు. పేరంటము జరుపుతారు. ఇలా చేయడం వలన పిల్లలకు దృష్టి దోషం తొలుగుతుందని భావిస్తారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
14.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## సంక్రాంతికి ప్రతి ఇంట్లో సిరిసంపదలు నెలకొనాలి



**నూతనకల్, విశాలభారతి:**
తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రైతులకు, ప్రజలకు మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన వరి సన్నధాన్యానికి బోనస్ అందించడం తోపాటు నిరంతర విద్యుత్ సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తూ పాడిపంటల అభివృద్ధి కోసం నిరంతరం చేస్తున్నారని వారు తెలిపారు. ఈ సంవత్సరం రైతులకు అధిక దిగుబడిగా పంటలు పండి రైతులకు కుటుంబాలలో సుఖసంతోషాలతో వెలుగుల నింపాలని కోరుతున్నానని తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**నరసింహులపేట, విశాలభారతి:**
మండలంలోని పడమటి గూడెం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం భోగి పండుగ రోజు ఎవరి ఇంటి ముందు వారే ముగ్గులు వేయాలని పార్టీ గ్రామ కమిటీ పిలుపుమేరకు మహిళలు వారి యొక్క ఇండ్ల ముందు ముగ్గులు వేశారు. గ్రామంలోని విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సాంస్కృతిక చిత్రపటాలను దేవుళ్ళ ప్రతిమలను ముగ్గు రూపంలో దింపి ఆకట్టుకునేలా చేశాయి.. దీనికి న్యాయ నిర్ణయితలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు చిదిమీళ్ళ బిక్షం, ప్రైవేట్ అధ్యాపకులు దాస రోజు నవీన్ కుమార్, మండల సిఆర్పి జక్కి రవికుమార్, మండల సమైక్య ఉద్యోగి దాస రోజు సత్యనారాయణలు న్యాయ నిర్ణయితలుగా వివరించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి ఇల్లు తిరిగి ముగ్గులను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను అరికట్టాలని వేసిన ముగ్గు ప్రత్యేకంగా ఆకర్షించింది. మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని శివుని రూపాన్ని ముగ్గులు చూపించి ఆకర్షించింది. మోడల్ స్కూల్ విద్యార్థి యశ్వంత్ మహిళలతో సైతం పోటీపడి ఎల్లమ్మ తల్లి చిత్రపటాన్ని అందించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు చిర్ర సతీష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు జక్కుల ఉప్పలయ్య, యూత్ అధ్యక్షులు మహబూబ్ పాషా, నాయకులు గువ్వ వెంకన్న, కనకచరి, సోమిరెడ్డి, నవీన్ రెడ్డి, ఉపేందర్, అనిల్, కుమార్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ కోర మీసాల వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

- జనవరి 10 కళ్యాణంతో ప్రారంభమై 18న అగ్నిగుండాలతో ముగింపు
- కొండపైకి మెట్ల మార్గం - నెరవేరిన భక్తుల కల
- పూర్తి ఐన ధ్యాన మందిరం
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- మంత్రి పొన్నం కృషి - భక్తులు ఖుషీ




**భీమదేవరపల్లి, విశాల భారతి**
చుట్టూ పచ్చని పొలాలు, పకృతి రమణీయతల మధ్య కొత్తకొండ గుట్టపై వెలిసిన కోర మీసాల వీరభద్రస్వామి అలయం జాతరకు అన్ని ఏర్పాట్లతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో కొలవైన వీరభద్రుడి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 10న భద్రకాళీ సమేతా వీరభద్రుడి కళ్యాణంతో అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఐదు లక్షలకు పైగా భక్తులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి వస్తారు. ఇప్పటికే లక్షలాదిమంది హాజరయ్యారు.

**స్థల పురాణం:**
కాకతీయ రుద్రేశ్వరుని కాలంలో మల్లికార్జున పండితుని మనుమడు కేదారి పండితునిచే వీరభద్రస్వామి ఆలయం శైవాగమానుసారం ప్రతిష్ఠింపబడినట్లు స్థలపురాణం చెబుతున్నది. సా.శ 1600 సం.లో పోయిల కట్టెల కోసం కొందమంది కుమ్మరులు ఎడ్ల బండ్లతో కొండపైకి వెళ్లారు. కట్టెలు కొట్టిన తరువాత అలసిపోయిన కుమ్మరులు నిద్రలోకి జారుకున్నారు. నిద్ర లేచి చూస్తే, ఎడ్లు కనబడకపోవడంతో రాత్రి అక్కడే పడుకున్నారు. అదే రాత్రి వారికి కలలో వీరభద్రుడు కనిపించి గుట్టపై నుంచి కిందికి దించి అక్కడ ఆలయంలో ప్రతిష్ఠిస్తే వారి ఎడ్లు దొరుకుతాయని చెప్పడంతో, గుట్టకిందకు దూదిమెత్తలలో విగ్రహాన్ని ఉంచి వీరభద్రస్వామిని ప్రతిష్ఠించినట్లు, ఈ క్రమంలో స్వామివారి కాలు విరిగినట్లు స్థానికులు తెలుపుతుంటారు. కాకతీయుల కాలంలో గుట్టపై ఈ దేవాలయం రాళ్ళ మధ్య నిర్మించబడింది. నేటికీ ఐదు కొలనులు నిత్యం నీటితో నిండి ఉండటం వీరభద్రస్వామి మహత్యమే అని గ్రామ ప్రజలు చెప్పుకుంటారు.

**ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు:**
ప్రతి సంవత్సరం జనవరి 10న, శ్రీ వీరభద్రస్వామి కల్యాణం జరుగగా, 11న గవ్యాతం, నిత్యోపాసన, నిత్యహోమం, నవగ్రహ హోమాలు, 12న, బలిహరణ, సూర్య యంత్ర పతిష్టాపన, అరుణ పారాయణం, 13 న, ఏకాదశి రుద్రహోమం, 14న భోగి పండుగ రోజున చండీహోమం, వేదపారాయణం, 15 న, బండ్లు తిరుగుట (జాతర), శత రుద్రాభిషేకం, ఉత్తరాయణ పుణ్యకాల పూజ, 16న, నాగవెల్లి, వసంతోత్సవం, 17 న, గణపతి పూజ, స్వామివారి త్రిశూల స్నానం, 18న, అగ్నిగుండాలు అనంతరం స్వామివారి గ్రామ పర్యటన జాతరలో ముఖ్య ఘట్టాలుగా ఉంటాయి.

**నేటికీ కుమ్మరి బండ్లు తిరిగిన తరవాతే ఎడ్ల బండ్లు తిరుగుట సంప్రదాయం:**
మొదట కుమ్మరుల బండ్లతో వీరభోనంతోనే జాతర ఊగిపోతుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కడిపికొండ, దామెరకు చెందిన కుమ్మరి వంశస్తులు ఆనవాయితీ ప్రకారం భోగి పండుగ రోజు కుమ్మరి (వీర)బోనం చేశారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్లను రథాలుగా తీర్చిదిద్దారు. శివసత్తుల నృత్యాలు, వీరశైవుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోనంతో వెళ్లిన కుమ్మరి వంశస్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.





**ఎడ్లబండ్లు తిరుగుట:**
మకర సంక్రాంతి రోజున భద్రకాళీ సమేతా వీరభద్రుడి సర్వాలంకార నిజరూపాన్ని దర్శిస్తే సర్వపీడల నుండి విముక్తి కలుగుతుందని శాస్త్రోక్తి. సోమవారం భోగి పండుగ సందర్భంగా మొక్కులు సమర్పించారు. మకర సంక్రాంతి మంగళవారం తెల్లవారు జామున అనగా ఉత్తరాయణ పుణ్యకాలమందు వందలాది ఎడ్లబండ్లతో రథయాత్ర జరుగనున్నది. భక్తి పారవశ్యంతో జాతర ఓలలాడుతోంది. తమ ఇలవేల్పు, ఇష్ట దైవం వీరభద్రుడికి భక్తులు మొక్కులు సమర్పించి, పూజాధికాలు చేస్తున్నారు. లక్షల సంఖ్యలో హాజరైన భక్త జనంతో కొత్తకొండ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

**భారీ పోలీసు బందోబస్తు:**
జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్సైలు సాయిబాబు, దివ్య ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో 700 మంది వరకు పోలీసులు విధులు నిర్వర్తిస్తారని ఆయన తెలిపారు. అడుగడుగునా పోలీసులు పహారా, గస్తీ నిర్వహించనున్నారు.

**భక్తులకు అన్ని సదుపాయాలకు ఏర్పాట్లు:**
ఉత్సవాల్లో భక్తుల కోసం అన్ని సదుపాయాలు కల్పించాం. తాగునీటితో పాటు స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వృద్ధుల కోసం వాహనాలు సమకూర్చుతాం. భక్తుల సౌకర్యార్థం పూర్తి వసతులు కల్పిస్తు న్నాం. వైద్యశిబిరం, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉన్నాయని ఆలయ ఈఓ కిషన్ రావు తెలిపారు.

**ఆలయ ప్రాంగణంలో అరుదైన దేవతావృక్షాలు:**
రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్వామివారి ఆలయంలో దేవతావృక్షాలు రుద్రాక్ష, జమ్మి, మర్రి, వేప, జుబ్బి, రావి, ఉసిరి ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలలో రాలిపడే రుద్రాక్షల కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తారు. బ్రహ్మోత్సవాల్లో రుద్రాక్ష చెట్టును భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.



## వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల
- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేముల
- బాధితునికి 2 లక్షల ఎల్వోసి అందజేత

**బాల్కొండ, విశాల భారతి**
మెండోరా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మండపం ప్రారంభం, అలాగే వెంకటేశ్వర స్వామి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన గ్రామస్థులకు, విడిసి, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.40 లక్షలతో నూతన కల్యాణ మండపం నిర్మించుకున్నమని, ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మెండోరా గ్రామంలో కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని అన్నారు. ఇక ముందు కూడా తన శక్తీ మేర గ్రామానికి పనులు చేయడానికి కృషి చేస్తా అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సంక్రాంతి మీ కుటుంబాల్లో వెలుగులు నింపాలని అలాగే అందరికి విజయాలు చేకూర్చాలని ఆకాంక్షిస్తూ బాల్కొండ నియోజకవర్గం ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**ఎల్వోసిని మంజూరు చేయించిన:**
నిమ్స్ లో చికిత్స కోసం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భరోసా కల్పించారు. మెండోరా మండలం కోడిచెర్ల గ్రామానికి చెందిన యం.దశరత్ న్యూరో చికిత్స అవసరమై నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స కోసం చేరారు. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి మెరుగైన చికిత్స కొరకు రూ.2లక్షల ఎల్వోసి మంజూరు చేయించి,దాని కాపీని వారి కుటుంబ సభ్యులకు బాల్కొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. నిరుపేదలమైన మాకు మెరుగైన వైద్య చికిత్స కొరకు ఎమ్మెల్యే వేముల ఎల్ఓసి మంజూరు చేయించారని వారి మేలు మర్చిపోలేమని జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని అలాగే ఎమ్మెల్యే వేములకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, మెండోరా వైస్ ఎంపిపి రవిందర్ గౌడ్, కోడిచెర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు దేవేంధర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ప్రతి ఇంట్లో సంబరాలు నింపాలి

- తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:**
మండల కేంద్రంలో శ్రీ శ్రీ పార్వతీ సమేత శంబులింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ ,మన గ్రోమోర్ సెంటర్ నూతనకల్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగినది .ముఖ్య అతిథులుగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీలలో మొదటి బహుమతి బద్దం సిరి గెలుచుకోగా దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ దాత దేవి రెడ్డి నర్సిరెడ్డి 3016 అందించారు. రెండవ బహుమతి బొమ్మగాని స్ఫూర్తి 2016. దాత చురకంటి చంద్రారెడ్డి దేవాలయ కమిటీ చైర్మన్ మూడవ బహుమతి జటంగి స్వప్న 1016. దాత. వీరమల్ల శ్రీనివాస్. మన గ్రోమోర్ సెంటర్ నూతనకల్ 4 ,5, 6 బహుమతులు (కన్సోలేషన్) ఇవ్వడం జరిగినది. అదేవిధంగా ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి దేవాలయ కమిటీ మన గ్రోమోర్ ఆధ్వర్యంలో వ్యక్తిగత బహుమతులు కూడా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చురకంటి చంద్రారెడ్డి ,ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి అంజయ్య, మన గ్రోమోర్ సెంటర్ అకౌంట్స్ ఆఫీసర్ బాలకృష్ణ, మేనేజర్ చిరంజీవి , యాస ముత్తారెడ్డి ,దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు జక్కుల ఉప్పలయ్య ,కోశాధికారి కొమురెల్లి విట్టల్ రెడ్డి, దేవి రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బత్తిని లక్ష్మయ్య, బద్దం వెంకట్రెడ్డి ,బండపల్లి యాదగిరి, దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులు మన గ్రోమోర్ సిబ్బంది అంజయ్య, స్పందన తదితరులు పాల్గొన్నారు.





## లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో 20 బేడ్ షీట్స్ పంపిణీ

**నేరేడుచర్ల, విశాలభారతి:**
నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా ఫాస్ట్ గవర్నర్ బాలయ్య డొనేట్ చేసిన 20 బెడ్ షీట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్ చైర్మన్ చైర్పర్సన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు రామస్వామి పాల్గొని మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ స్థాపించిన లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో సేవా కార్యక్రమాలు చేస్తూ, అందరి మన్ననలు పొందుతూ ఉందని, వారు చూపిన మార్గంలోనే నేరేడుచర్ల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు చలికాలంలో అవస్థ పడుతున్నటువంటి వారికి బెడ్ షీట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారాం రెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి,క్లబ్ కార్యదర్శి షేక్ యూసుఫ్, క్లబ్ సభ్యులు గుండా సత్యనారాయణ, కందిబండ శ్రీనివాసరావు, నీలా శ్రీను, బోనగిరి అంజయ్య , రాచకొండ శ్రీనివాసరావు,పూర్ణచంద్రారెడ్డి, చిలక రాజు శీను, చిత్రం విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**భీమదేవరపల్లి, విశాలభారతి :**
పుష్కరకాలం (12 ఏళ్ల) తర్వాత వాట్సాఫ్ వేదిక పుణ్యమా అని ఆ బాల్య స్నేహితులు ఒక్కటయ్యారు. ఒకరినొకరు చూసుకున్న ఆనందంలో తబ్బుబ్బయి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు, తాము ఆడుకున్న పాఠశాల పరిసరాలు తనివితీరా చూసుకొని గత కాలపు అనుభూతులను స్నేహితులతో పంచుకొని, అంతులేని ఆనందాన్ని పంచుకున్నారు. వివరాల్లోకి వెళితే హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని విశ్వశాంతి విద్యాలయంలో 2012 2013 విద్యా సంవత్సరం నాటి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. 12 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. చిన్ననాటి స్నేహితులు చదువుకునే రోజులు, చేసిన అల్లరి ఇలా గడిచిన మధురమైన రోజుల్ని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటూ తమ అనుభూతుల్ని పంచుకున్నారు.

**గురువులకు ఘన సన్మానం:**
తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమ లాంటి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మృతి చెందిన స్నేహితులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. పూర్వపు ఉపాధ్యాయులు దస్తరి ఉమామహేశ్వర్, చెప్యాల గోపాల్ రెడ్డి, కాశిరెడ్డి ఆదిరెడ్డి, రమేష్, నజీమ్, జయ, కరుణశ్రీ, భారతిలను ఘనంగా సన్మానించారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
14.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఘనంగా భోగి పండగ

ఆమనగల్లు, విశాలభారతి : పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని, సంక్రాంతి పండ గను ప్రజలు సంతోషంగా జరుపు కోవాలని టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా తొలి పండగ భోగిని సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నిద్ర లేచి, స్నానాలు ఆచరించి, భోగి మంటలు వేశారు. అందరూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భోగి పండుగ సకల భోగ భాగ్యాలు, సుఖ సంతోషాలను ప్రజలకు అందించాలని కోరారు. మహిళలు, చిన్నారులు ఉదయం నుండే తమ ఇండ్ల ముందు వివిధ రంగులతో అందమైన ముగ్గులు, గొబ్బె మ్మలు, పిండిగొమ్మలు చక్కగా అలం కరించారు.

# సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలి

- ఎస్ఐ రాజ్ కుమార్



పినపాక, విశాలభారతి: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పినపాక మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. ముందుగా మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోడి పందాలను ఉద్దేశించి మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా కోడిపందాలు ఆడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, పందెపు రాయుళ్లను ప్రత్యేకమైన ఫోర్స్ తో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడీ పందేలు, పేకాట, గుండాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీని వలన వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా మండలంలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





# పల్లె పల్లెన ఎగిసిపడిన భోగి మంటలు

- చెడును తొలగించి.. భోగ భాగ్యాలనిచ్చేది భోగిపండగ
- గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

ఆమనగల్లు, విశాల భారతి

పల్లె పల్లెన ఎగిసిపడే భోగి మంటలతో అన్ని అరిష్టాలు తొలిగి ప్రతి ఒక్కరి జీవితాలలో సుఖ సంతోషాలు, సకల భోగభాగ్యాలు కలగాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ గ్రామంలో సోమవారం వేకువజామున గ్రామ పెద్దలతో కలిసి భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోగిమంటల్లో ఆవు పిడకలు, నెయ్యి, ఔషధ చెట్ల బెరడులు లాంటివి వేసి కాల్చడం వల్ల గాల్లోని సూక్ష్మక్రిములు నశించి, గాలి శుద్ధి అవుతుందని పెద్దలు చెప్పే వారని అన్నారు. భోగి మంటలతో భవిష్యత్తు గురించిన భయాల్నీ, మనలోని అసూయా, ద్వేషాల్నీ, వెంటాడుతోన్న బాధల్నీ తీసేసి, కొత్తగా జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. భోగి పండుగ రోజున భోగి మంటలతో శారీరకంగానే కాదు, మానసికంగానూ మనల్ని మనం దృఢంగా మార్చుకోవడమే ఈ పండగ ఉద్దేశమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, రైతులు పాడి పంటలతో ఎదగాలని కోరుతూ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకులు శ్రీధర్ పంతులు, గ్రామ పెద్దలు జంగా రెడ్డి, వెంకట్ రెడ్డి, గుద్దేటి వెంకటేష్ గుప్తా, నరేందర్ రెడ్డి, పెంటా రెడ్డి, పాండు, మల్లేష్, అశోక్ రెడ్డి, శివలింగ చారి, సాయి ప్రభు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను
# వెంటనే అమలు చేయాలి

- 200 డబ్బులు, 4వేల మందితో భారీ ర్యాలీ
- తహాశీల్దార్ కు వినతి పత్రం అందజేత

బాల్కొండ, విశాల భారతి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరుతూ భీమ్‌గల్ మండల కేంద్రంలో మాదిగ ఐక్యవేదిక పిలుపు మేరకు మాదిగల ధర్మ యుద్ధం అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత ప్రారంభమైన ర్యాలీ బస్ స్టాండ్ మీదుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసే వరకు కొనసాగింది. ర్యాలీలో 200 డబ్బులు, అన్ని గ్రామాల నుండి సుమారు 4వేల మంది మాదిగ జనాభా పాల్గొన్నారు. దీంతో మాదిగ జనాభాతో మండల కేంద్రం నిండుకుండలా మారింది. మాదిగల ధర్మ యుద్ధం ర్యాలీకి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మద్దతు తెలిపి మాదిగల హక్కులకై జరిగే ప్రతి యుద్ధంలో తోడు ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ జాతి సీనియర్ నాయకులు, సంఘాల పెద్ద మనుషులు మాట్లాడుతూ... సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని, 30 సంవత్సరాల పోరాటానికి ముంగిపు పలకాలని రాష్ట్ర ప్రభుత్వాని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుభవార్త వస్తుందని విశ్వాసంతో ఎదురు చూస్తున్నామని తెలిపారు. రిజర్వేషన్ ఏబిసిడి వర్గీకరణ వెంటనే అమలు చేయాలని కోరుతూ భీమ్‌గల్ ఎమ్మార్వోకి వినతి పత్రాన్ని అందజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ మండల మాదిగ దండోరా జెఏసి అధ్యక్షుడు గడాల ప్రసాద్, జె.జె నర్సయ్య, యోనా, రతన్ రాజ్, రాజేందర్, జనార్ధన్, రాజేందర్, కృష్ణ, రాజేష్, సంతోష్, నరేష్, శీను, సీనియర్ దళిత జాతి నాయకులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థులు, డప్పుకల బృందాలు తదితరులు పాల్గొన్నారు.



# సబితమ్మకు సంక్రాంతి శుభాకాంక్షలు

ఆమనగల్లు, విశాల భారతి : తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డికి సోమవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పలువురు నేతలు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పలువురు నేతలతో కలిసి శాలువలతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సబితమ్మ సేవలు అభినందనీయమని, నేటి తరం రాజకీయ నాయకులకు దిశానిర్దేశకులని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు మూడ అశోక్, సిద్దిగారి దాసు, రాయి కంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్
# ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

బాల్కొండ, విశాల భారతి

భోగి పండగ సందర్భంగా రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు స్వరూప ఇంద్ర గౌడ్, మాజీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పాకాల వాని దామోదర్ గౌడ్ హాజరైయ్యారు. ఈ పోటీల్లో మొత్తం 45 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి రాపెల్లి సౌమ్య, రెండవ బహుమతి నూనె రేణుక, మూడవ బహుమతి లక్కిడి ప్రవళిక గెలుచుకున్నారు. వీరే కాకుండా ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ప్రతి ఒక్క మహిళ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిషన్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్, భోజన్న, హలీం, నెహ్రూ, గంగారెడ్డి, రజనీకాంత్, మోహన్ కృపాల్, చిన్న ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

# భోగ బాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలి

- రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట, విశాల భారతి

భోగ బాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజలకు సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా సమస్త రాష్ట్ర ప్రజలు సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రానికి వెన్నెముకగా నిలిచిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి సాధించడం సంవత్సర కాలంలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి ప్రతీకగా ఆయన అభివర్ణించారు. ఇది రైతునామ సంవత్సరమని రాష్ట్ర ప్రభుత్వం రైతుపక్షపాతి అని చెప్పడానికి యావత్ భారత దేశంలోనే తెలంగాణా రైతాంగం కనీవినీ ఎరుగని రీతిలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించడం అద్దం పడుతుందన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు గాను గడిచిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్ట్ ల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు గాను బృహత్ ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. అభివృద్ధికి విద్యనే తొలిమెట్టు అని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల అంచనా వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలు నెలకొల్పుతున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం కామన్ డైట్ ప్రవేశ పెట్టడంతో పాటు ఏక కాలంలో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అంతే గాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాలలో ఉంటూ విద్య నభ్యసిస్తున్న విద్యార్థులకు ఇకపై సన్న బియ్యం అన్నం వడ్డించ బోతున్నట్లు ఆయన తెలిపారు. అంతే గాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చెయ్యడంతో పాటు తెల్ల రేషన్ కార్డుదారులందరికి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పౌర సరఫరాల శాఖలో తెచ్చిన అనేక సంస్కరణలు అద్భుతమైన ఫలితాలు ఇచ్చాయని, గడిచిన దశాబ్దాకాలంగా భ్రష్టు పట్టిపోయిన నీటిపారుదల రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామన్నారు. ఇదంతా రాష్ట్రసర్వోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అని ఇందులో రాష్ట్ర ప్రజలు భాగస్వామ్యం అయి ఇతోధికంగా తోడ్పాటునందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.



# యువత క్రీడ రంగంలో నైపుణ్యం పెంపొందించుకోవాలి

మునుగోడు, విశాల భారతి

సింగారం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సోమవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, శారీరక మానసిక ఉల్లహాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెంకటేశం, నేరటి బాలు, కందుకూరి శంకర్, సోమగోని రమేష్, వట్టి వెంకట్ రెడ్డి, కుంభం సురేందర్ రెడ్డి, కట్టుముళ్ళ వెంకట్ రెడ్డి, కోడి అర్జున్, నెరటి నగేష్, యంపల్ల వెంకన్న, నకేరికంటి ముష్లి, పిట్టల శ్రవణ్, నవీన్, శశికిరాన్, నాని, సాయి, మహేష్, అభినయ్, మదు, శ్రీకాంత్, మురళీ, శంకర్ ప్రసాద్, శాంతి, తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాలలో తప్పిన బాలుడి అప్పగింత

విశాల భారతి, భీమదేవరపల్లి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ బ్రహ్మోత్సవాలలో కొక్కుల హర్షిత్ ములుగు జిల్లా వెంకటాపూర్ అనే అబ్బాయి కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలలో తప్పిపోయాడు. వీరభద్ర స్వామి జాతరలో తప్పిపోయిన అబ్బాయిని ఏసిపి తిరుమల్, సిఐ పులి రమేష్ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తండ్రి విష్ణు పోలీసు బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలి
- ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

సూర్యాపేట, విశాలభారతి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సూచించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం లోని శంకర్ విలాస్ సెంటర్లో ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహన దారులకు వివరించారు. వాహన చోదుకులు నిబంధనలు పాటించకపోతే నిబంధనల ప్రకారం జరిమానాలు తప్పవని హెచ్చరించారు. తలలో ఉన్న సున్నితమైన అవయవం మెదడు ఈ మెదడు దెబ్బ తినకుండా ఉంటే మిగిలిన శరీర భాగాలు గాయాలైన కోలుకునేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# గేమ్ ఛేంజర్ టీమ్ ప్రకటన.. ఫ్యాన్స్ ఖుష్



శ్రీహీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్' . ఎన్నో అంచనాల మధ్య జనవరి 10న ఈసినిమా విడుదలైంది. సాంకేతిక కారణాల వల్ల ఈ సినిమాలోని ఫీల్‌గుడ్ మెలోడి 'నానా హైరానా'ను చిత్రబృందం రిలీజ్ చేయలేదనే విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి ఆ పాటను యాడ్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. 'నానా హైరానా' పాటను బిగ్ స్క్రీన్‌పై చూసి ఎంజాయ్ చేయమని కోరింది.
'గేమ్ ఛేంజర్' సినిమా బడ్జెట్ దాదాపు రూ.400 కోట్లు కాగా అందులో రూ.75 కోట్లు పాటలకే ఖర్చు చేశామని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో చిత్రీకరించిన ఫస్ట్ ఇండియన్ సాంగ్ 'నానా హైరానా' రికార్డు సృష్టించి 'మెలొడీ ఆఫ్ ది ఇయర్'గా నిలిచింది. న్యూజిలాండ్‌లో 6 రోజుల పాటు దీని షూటింగ్ జరిగింది. ఈ ఒక్క పాట కోసమే దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. తమన్ సంగీతం అందించగా రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం యూత్‌ను ఎంతో ఆకట్టుకుంది. ఈ గీతాన్ని కార్తిక్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. సాంకేతిక కారణాల వల్ల ఈ పాటను రిలీజ్ చేయలేకపోతున్నామని సినిమా విడుదల రోజు టీమ్ ప్రకటించింది. "ఇన్‌ఫ్రారెడ్ ఇమేజ్‌ల ప్రాసెసింగ్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ కారణంగా ప్రస్తుతం దీన్ని ప్రదర్శించలేకపోతున్నాం. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం. జనవరి 14 నుంచి ఈ పాటను సినిమాలో జోడిస్తాం. దీనికోసం మా టీమ్ అంతా రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తోంది" అని చెప్పింది. చెప్పిన దాని కంటే రెండు రోజుల ముందుగానే ఈ పాటను యాడ్ చేయడంపై సినీ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# స్టార్ హీరోతో అవకాశం వదులుకున్న సాయిపల్లవి

హీరోయిన్ సాయి పల్లవిని అభిమానులు ముచ్చటగా నేచురల్ బ్యూటీ అని పిలుచుకుంటుంటారు. మిగతా హీరోయిన్ల మాదిరి ఆమె విపరీతమైన మేకప్ తో ఎప్పుడూ కనిపించదు. బ్యూటీ కాస్మొటిక్స్ కంపెనీలు ఆమెను బ్రాండ్ అంబాసిడర్ గా తీసుకోవాలనుకున్నా... ఆమె సున్నితంగా తిరస్కరించింది. తాను మేకప్ వస్తువులు వాడనని... అలాంటప్పుడు తాను ఇలాంటి ప్రొడక్ట్స్ ని ప్రమోట్ చేయలేనని ఆమె చాలా స్పష్టంగా చెప్పింది. సాయి పల్లవికి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులో కూడా ఎంతో ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఆమెకు కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ సినిమాలో అవకాశం వచ్చింది. విక్రమ్ సినిమాలో ఛాన్స్ వస్తే ఎవరూ వదులుకోరు. కానీ, సాయి పల్లవి ఆ ఛాన్స్ ను వదులుకుంది. ఆమెకు ఆ డేట్స్ లో కాల్‌షీట్స్ లేకపోవడంతో ఆ అవకాశాన్ని వదులుకుంది. 'బలగం' మూవీతో దర్శకుడిగా సూపర్ హిట్ అందుకున్న వేణు 'ఎల్లమ్మ' మూవీని తెరకెక్కించబోతున్నాడు. ఈ చిత్రానికి దిల్ రాజు నిర్మాత. ఈ సినిమాలో హీరోగా నితిన్ నటించబోతున్నాడు. కథానాయిక పాత్ర చాలా ప్రధానంగా ఉండే ఈ సినిమాకు సాయి పల్లవిని హీరోయిన్ గా ఎంచుకున్నారు. కథ నచ్చడంతో ఆమె ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమాతో వేణు మరో హిట్ కొడతాడనే అంచనాలు ఉన్నాయి.



# గోల్డెన్ శారీలో మీనాక్షి మెరుపులు..

మీనాక్షి చౌదరి ఎప్పటికప్పుడు అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారుతోంది.గత కొద్ది రోజులుగా వరుస ఫొటో షూట్స్ తో నెట్టింట రచ్చ చేస్తోంది.తాజాగా గోల్డ్ కలర్ శారీలో మీనాక్షి ఫోజులు నెటిజన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి.గోల్డ్ శారీలో మీనాక్షి లుక్స్ చూసి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ఆమె ఫొటోలపై లైకుల వర్షం కురిపిస్తున్నారు.మీనాక్షి చౌదరి ప్రజెంట్ టాలీవుడ్ లో వరుసపెట్టి సినిమాలు చేస్తోంది.గత ఏడాది 'లక్కీ భాస్కర్' తో భారీ సక్సెస్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఆడియన్స్ ముందుకు రాబోతుంది.



# పదేళ్ల తర్వాత రిలీజైనా వర్కవుట్టైంది

విశాల్ నటించిన `మదగజరాజా` ఈ ఆదివారం థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. సినిమా తెరకెక్కిన దాదాపు పదేళ్ల తర్వాత ఈ చిత్రం థియేటర్లలో విడుదలైంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2012లోనే పూర్తయింది. కానీ రకరకాల ఆర్థిక కష్టాలతో విడుదల డిలే అయింది. ఎట్టకేలకు అన్ని కష్టాల నుంచి గట్టెక్కి నిన్ననే విడుదలైంది.ఈ సినిమా ఇన్నేళ్ల తర్వాత వచ్చినా ఇందులో కామెడీ, థ్రిల్స్, విజువల్ బ్రిలియన్సీ ఆకట్టుకున్నాయన్న ప్రశంసలు దక్కాయి. సినిమా చూసిన తర్వాత చాలా మంది ప్రేక్షకులు దర్శకుడు సుందర్.సిని మెచ్చుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత కూడా ఇది ఫేడవుట్ అవ్వలేదు. ఈ చిత్రంలో కామెడీ బాగానే వర్కవుటైంది. కొన్ని అతిశయోక్తి సన్నివేశాలు ఉన్నా కానీ, కమర్షియల్ గా ఆకట్టుకునే ఎలిమెంట్స్ తో సినిమా రక్తి కట్టించిందని చాలా మంది ప్రశంసించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.